# శాంతిభద్రతల రక్షణ

ఆ రోజు నగరంలో సందడి ఎక్కువగావుంది. అధికధరలకు నిరసనగా నగరములో సమ్మె జరుగుతున్నది. అన్నిపార్టీలవారూ కలిసి నినాదాలిస్తూ ఊరేగింపులు జరిపారు. "ధరలు తగ్గించాలి" – "వారానికి రెండు ఆదివారాలుండాలి" – "నెలకు రెండు ఫస్టుతారీకు లుండాలి" అని కేకలు వేశారు. ఊరేగింపులోని జనం కొన్ని కార్లమీదా దుకాణాలమీదా రాళ్లు రువ్వారని పోలీసులు భాష్పవాయు ప్రయోగం చేశారు. దాంతో ఉద్రిక్తత ఎక్కువయింది. పోలీసు అధికారులకు మతిపోతున్నది.

ఉన్నత పోలీసు అధికారుల సమావేశం జరిగింది. లాఠీలూ, తుపాకులతో ప్రతినాలుగు గజాలకూ రక్షణభటులను నిలబెట్టడానికి నిశ్చయించారు. ఈవార్త దవానలంలా ఊళ్ళో వ్యాపించింది. విద్యార్థులు మరీ పేట్రేగిపోతున్నారు. ఉద్రిక్తత ఎక్కువయింది.

సాయంకాలం విజయమైదానంలో మీటింగు పెట్టడానికి కార్యాచరణసంఘం నిశ్చయించింది. కొన్నిలక్షలమంది సమావేశానికి వొస్తారని అంచనా వేయబడింది. ఇంతలో ఒకాయన అత్యున్నత అధికారిని కలుసుకుని రహస్యంగా మాట్లాడాడు. వివరాలు ఎవరికీ తెలియలేదు. సాయంకాలం సభకు నగరమంతా వచ్చింది ఇసుక వేస్తే అది వెళ్ళి ప్రజల నెత్తిమీద రాలుతున్నది కాని కిందని రాలడంలేదు.

అకస్మాత్తుగా హెలికాప్టర్లో ఎవరో దిగారు. ఆయన్ని చూడగానే ముందు వరుసలో జనం కదలడం మొదలుపెట్టారు. "నిన్నెవరు ఇక్కడికి ఆహ్వానించారు? ఈ హెలికాప్టరేమిటి" అని కార్యకర్తలంతా అతనిమీదికి లంఘించబోతున్నారు. వెంటనే నలభైమంది పోలీసులు అతన్ని జాగ్రత్తగా పట్టుకుని మైకుదగ్గరకు తీసుకువెళ్ళారు. జనసముద్రఘోష ఒక్కసారి ఆగిపోయింది. ఆయన, ఆ కవిగారు, జేబుల్లోంచి కట్టలు తీశారు. నిద్రలో నడుస్తున్న మనుష్యుల్లా ఇన్నిలక్షలమంది వెనక్కి వెనక్కి నడవడం మొదలుపెట్టారు కవిగారు కావ్యగానం ప్రారంభించారు. కావ్యగానం ముగిసేటప్పటికి మైదానమంతా నిర్మానుష్యంగా వుంది.

పోలీసులూ అధికారులూ ఒక్కసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని మోకాళ్ళమీద కూర్చుని ఆధునిక కవిత్వశక్తికి వందన మాచరించారు.

గోపాలచక్రవర్తి